సాక్షి అనకాపల్లి

శనివారం । 22 । ఏప్రిల్ । 2023

న్యూస్‌రీల్

వర్ష సూచన

అనకాపల్లి టౌన్: రాగల అయిదు రోజులు వర్ష సూచన ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం పేర్కొన్నారు. ఉష్ణోగ్రతలు తగ్గుతాయని, అక్కడక్కడా వర్షాలు నమోదవుతాయని తెలిపారు. ఉష్ణోగ్రతలు 33 నుంచి 33.5 డిగ్రీలు, గాలిలో తేమ శాతం 80 నుంచి 85, గాలి గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

పీఎం కిసాన్ ఈకేవైసీ గడువు ఈనెల 30

తుమ్మపాల : పీఎం కిసాన్ పథకం నగదును ప్రభుత్వం మే నెలలో రైతుల ఖాతాలకు జమ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కామన్ సర్వీస్ కేంద్రాల్లో రూ.15 చెల్లించి, రైతు భరోసా కేంద్రాల్లో ఉచితంగా ఓటీపీ, బయోమెట్రిక్ విధానంలో ఈకేవైసీ చేసుకోవచ్చన్నారు. జిల్లాలో 2 లక్షల 13 వేల 441మంది లబ్ధిదారుల్లో ఇప్పటి వరకు లక్షా 70 వేల 290 మంది ఈకేవైసీ చేసుకున్నట్టు వెల్లడించారు. మిగిలిన 43,151 మంది లబ్ధిదారులు ఈ నెల 30 లోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీవో జయరాం, అధికారులు

నర్సీపట్నం: రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మాడుగుల, రావికమతం, గొలుగొండ, నక్కపల్లి ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న 2 కార్యకర్తలు, 14 ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఆర్డీవో హెచ్.వి.జయరాం, ఐసీడీఎస్ పీడీ జి.ఉషారాణి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో జ్యోతి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 16 పోస్టులకు 34 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారని, ఇంటర్వ్యూకు 31 మంది హాజరయ్యారని పీడీ ఉషారాణి తెలిపారు.

సుపరిపాలనలో సివిల్ సర్వెంట్లు కీలకం

- జాతీయ సివిల్ సర్వెంట్స్ దినోత్సవంలో జేసీ జాహ్నవి



ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఆర్వో వెంకటరమణ

తుమ్మపాల : ప్రభుత్వ అధికారులు నిస్వార్థం, నిబద్ధత, మంచి ఆలోచనలతో విధులు నిర్వహించడం ద్వారా అభివృద్ధి సాధ్యపడుతుందని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జాతీయ సివిల్ సర్వెంట్స్ దినోత్సవంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు సమాజానికి తోడ్పడే విధంగా అమలు చేయడంలో సివిల్ సర్వెంట్ల ప్రతిభ ప్రతిఫలిస్తుందన్నారు. దేశ నిర్మాణం, జాతి పురోగతికి పనిచేస్తున్నపుడు ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ దేశానికి స్టీల్‌ఫ్రేమ్ సివిల్ సర్వెంట్లని మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ అభివర్ణించారన్నారు. డీఆర్వో పి.వెంకటరమణ మాట్లాడారు. అధికారులతో జేసీ ప్రతిజ్ఞ చేయించారు.

అనుమతులు లేని వాటర్ ప్లాంట్లు సీజ్

నర్సీపట్నం/మాకవరపాలెం: అనుమతులు లేని రెండు వాటర్‌ప్లాంట్లను సీజ్ చేశామని నర్సీపట్నం డివిజనల్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించామని ఆయన తెలిపారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి శివారులో నిర్వహిస్తున్న డిసైజ్ వాటర్ ప్లాంట్‌ను తహసీల్దార్ అన్నాజీరావుతో కలిసి తనిఖీ చేశామన్నారు. ఐఎస్ఐ అనుమతులు లేకుండా తాళ్లపాలేనికి చెందిన అమృత వాటర్ ప్లాంట్ లేబుల్ కలిగిన ప్లాస్టిక్ కవర్లను తీసుకువచ్చి వాటర్ విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడిందన్నారు. మాకవరపాలెం మండలంలో అనధికారికంగా నిర్వహిస్తున్న రెయిన్ డ్రాప్ వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేశామన్నారు. వాటర్‌ప్లాంట్లతో పాటు పట్టణంలోని లంబసింగి వనం రెస్టారెంట్, నాయుడుకుండ బిర్యానీ హోటల్స్‌ను తనిఖీ చేసి ఫుడ్ శాంపిల్స్ సేకరించామన్నారు. శాంపిల్స్‌ను హైదరాబాద్ నాచవరం ఫుడ్ లాబొరేటరీకి పంపించామని, ఏమైనా లోపాలుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

సత్తా చాటిన కొత్త జిల్లా

వైద్య సేవల్లో మేటి.. స్వస్థతలో ఘనాపాటి

వైద్య సేవలు బహు విధాలు.. వ్యాధులు చుట్టుముడితే చికిత్స అందించడం ఒక ఎత్తయితే అసలు అనారోగ్యమే రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం మరో ఎత్తు. నివారణ కన్నా నియంత్రణే ప్రజలను ఆరోగ్యవంతులను చేస్తుంది. అలాంటి స్వస్థత కలిగించే ముందస్తు చర్యలు సమర్థంగా తీసుకున్నందుకే అనకాపల్లి జిల్లా ఇప్పుడు జాతీయ స్థాయిలో విజేతగా నిలిచింది. శుక్రవారం ఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి 'ప్రైమ్ మినిస్టర్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్–2022' అవార్డు అందుకున్నారు.

- అనకాపల్లి జిల్లాకు 'ప్రైమ్ మినిస్టర్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్'
- ప్రధాని మోదీ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



సాక్షి, అనకాపల్లి: అప్పుడే పురుడు పోసుకున్న కొత్త జిల్లా దేశంలోనే అత్యుత్తమ సేవలందించి ప్రతిభ చాటుకుంది. అనారోగ్య సమస్యలు రాకముందే ముందస్తు చర్యలు తీసుకోవడంలో మేటిగా నిలిచింది. 'ప్రైమ్ మినిస్టర్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్' అవార్డును 2006లో ప్రవేశపెట్టారు. ఈ అవార్డును అసాధారణమైన, వినూత్నమైన సేవలు అందించిన జిల్లాకు అందిస్తారు. స్వస్థ్ భారత్ విభాగంలో ఆయుష్మాన్ భారత్, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్స్‌లో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా అనకాపల్లి జిల్లాకు జాతీయ అవార్డు లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఈ గుర్తింపు లభించేందుకు దోహదపడింది. గత ఏడాది నూతన జిల్లాగా అనకాపల్లి ఏర్పడిన నాటి నుంచి డిసెంబర్ నెల వరకూ జిల్లాలో వెల్‌నెస్ అండ్ హెల్త్ సెంటర్లు (విలేజ్ క్లినిక్‌లు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీ) ద్వారా ప్రివెంటివ్ హెల్త్ కేర్ తీసుకోవడం, ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది వెళ్లి వైద్యసేవలందించడం వంటి వినూత్న కార్యక్రమాలకు గానూ జాతీయ అవార్డు దక్కింది.



వైద్య సేవలకు ప్రతీక.. హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్

క్షేత్రస్థాయిలో వైద్యసేవలను పరిశీలించిన కేంద్ర బృందం

ఆయుష్మాన్ భారత్ ప్రాజెక్టు కింద కేంద్ర వైద్య బృందం 2023 ఫిబ్రవరి నెలలో ఒకసారి.. ఏప్రిల్ నెలలో ఒకసారి సందర్శించింది. జిల్లాలో అందిస్తున్న వైద్యసేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోగుల నుంచి సమాచారం సేకరించారు. టెలీ మెడిసిన్ ద్వారా విలేజ్ హెల్త్ క్లినిక్ (వెల్‌నెస్ సెంటర్ల) ద్వారా 2022లో ఎంతమందికి వైద్యసేవలందించారు.. వైద్యసేవలు క్షేత్ర స్థాయిలో ఎలా అందుతున్నాయి.. తదితర వివరాలను పరిశీలించారు. 2023 ఫిబ్రవరి 8న సబ్బవరం మండలం నార్వాడు సబ్ సెంటర్లు, అచ్యుతాపురం మండలం ఇరువాడ, తంతడి గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను మానిటరింగ్ చేశారు. పరవాడ, మంగవరం పీహెచ్‌సీలను కూడా పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, ప్రతీ నెలా 9వ తేదీన పీహెచ్‌సీలు, హెల్త్ సెంటర్లలో యాంటినాటల్ చెకప్స్, సచివాలయంలో ఏఎన్ఎంల ద్వారా అందించిన వైద్యసేవలను క్షేత్ర స్థాయిలో రెండు పర్యాయాలు అధ్యయనం చేశారు.

ప్రథమస్థానంలో నిలిపిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్

గ్రామ స్థాయిలో నిరుపేదలకు మెరుగైన ఆరోగ్య

జిల్లాలో సేవలందిస్తున్న వైద్య కేంద్రాలు

వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు	424
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	45
అర్బన్ హెల్త్ సెంటర్లు	9

సంరక్షణ సేవలను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకువచ్చింది. ప్రతీ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్య అధికారులలో ఒక వైద్య అధికారి పీహెచ్‌సీ వద్ద ఓపీ సేవలందించడం.. మరో వైద్య అధికారి క్షేత్రస్థాయిలో ఇంటికే వెళ్లి సేవలందించడం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 45 పీహెచ్‌సీలలో 90 మంది వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 అంబులెన్స్ మెడికల్ టెక్నీషియన్లు సేవలందిస్తున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో మొత్తం 67 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. 104 ఎంఎంయూ ద్వారా ఈసీజీ సేవలు కూడా అందుబాటులోకి తీసుకురావడం వంటి సేవలను పవర్ పాయింట్ ప్రజంటేషన్‌గా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వివరించడంతో ప్రధానమంత్రి ఇన్నోవేషన్ జాతీయ అవార్డు సాధించింది. అప్పటివరకూ టాప్–9 లో ఉన్న జిల్లా టాప్–1లో నిలిచింది. దీనికి తోడుగా జిల్లాలో ఏర్పాటు చేసిన టెలీ హబ్ ద్వారా విలేజ్ క్లినిక్‌లలో (హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు) స్పెషలిస్టు సేవలందించడం వంటివి కూడా టాప్‌లో నిలిపాయి.

డిప్యూటీ సీఎం అభినందనలు

మాడుగుల: వైద్య ఆరోగ్యసేవల రంగంలో అనకాపల్లి జిల్లాను దేశ స్థాయిలో ప్రథమంగా నిలిపినందుకు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అభినందించారు. నేషనల్ సివిల్ సర్వీస్ డే సందర్భంగా ప్రధానమంత్రి మోదీ చేతుల మీదుగా ఢిల్లీలో కలెక్టర్ 'ప్రైమ్ మినిస్టర్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్' అందుకోవడం ఆనందదాయకమన్నారు. జిల్లా కలెక్టరుగా వచ్చిన ఏడాదిలోనే కొత్త జిల్లాను జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిపినందుకు ఆయన ఫోన్‌లో అభినందనలు తెలియజేశారు. వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



పల్లె చెంతనే ఆధునిక వైద్యం

ప్రతి ఉద్యోగికి ఈ అవార్డు అంకితం



మృత్యువాత పడకుండా.. వ్యాధుల బారిన పడిన వారి నుంచి వ్యాధులు ఇతరులకు సోకకుండా జాగ్రత్త వహిస్తే సగం అనారోగ్య సమస్యలు రాకుండా చూడవచ్చు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారి ఇంటికి వెళ్లి హెల్త్ చెకప్‌లు చేయడం, డయాబెటిస్, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధి బారిన పడకుండా ప్రివెంటివ్ చర్యలు తీసుకోవడంలో అనకాపల్లి జిల్లా అగ్రస్థానంలో నిలవడం చాలా సంతోషంగా ఉంది. దేశంలో ఉన్న 766 జిల్లాల్లో మన జిల్లా ఈ అవార్డు దక్కించుకోవడం.. ప్రధాని చేతుల మీదుగా అందుకోవడం చాలా గర్వంగా ఉంది. హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల ద్వారా స్వస్థ్ భారత్‌గా అనకాపల్లి జిల్లా ఈ అవార్డు సాధించుకుంది. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులందరూ పనిచేయాలి. వైద్యశాఖలో ఉన్న ప్రతి ఉద్యోగికి ఈ అవార్డు అంకితం.

– రవి పట్టాన్‌శెట్టి, జిల్లా కలెక్టర్

ప్రభుత్వ వైద్య విధానాలే అవార్డుకు దోహదం



దేశంలోనే వైద్య సేవల్లో ఉత్తమ జిల్లాగా నిలిచి అనకాపల్లి జిల్లా అవార్డు దక్కించుకోవడం.. పీఎం నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం చాలా గర్వంగా ఉంది. వైద్య రంగంలో ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విప్లవాత్మక మార్పులు, వైద్యసేవలకుగాను అవార్డు సాధించాం. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో, సచివాలయాల్లో, విలేజ్ క్లినిక్‌లలో పనిచేసే వైద్య సిబ్బంది శ్రమ ఆధారంగానే ఈ అవార్డు సాధించాం. ఈ క్రెడిట్ అందరికీ దక్కుతుంది. ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా వైద్యసేవలందిస్తాం.

– డాక్టర్ హేమంత్, జిల్లా వైద్యశాఖాధికారి, అనకాపల్లి

'జగనన్నే మా భవిష్యత్తు'కు విశేష స్పందన

- టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- గొర్లివానిపాలెంలో రూ.2 కోట్లతో స్టేడియం ప్రారంభం

పరవాడ : రాష్ట్రంలో నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని టీటీడీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. గొర్లివానిపాలెం జీఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీ సమీపంలో రూ.2 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డికి పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. దేశపాత్రునిపాలెం నుంచి గొర్లివానిపాలెం ఇండోర్ స్టేడియం వరకు కార్యకర్తలు రెండు వేల బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన పరవాడ ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్లు వెచ్చించి పూర్తి చేసిందన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చొరవతో ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. యువతీయువకుల జీవితాల్లో వెలుగులు నింపడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. జగనన్న పాలన నచ్చని పచ్చ పార్టీ, పచ్చ మీడియా జగనన్న స్టిక్కర్లను తొలగించే కార్యక్రమాలకు పూనుకొంటుందన్నారు.



గజమాలతో టీటీడీ ఛైర్మన్ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఫార్మాసిటీ కాలనీలో 'జగనన్నే మా భవిష్యత్తు'

ఫార్మాసిటీ కాలనీలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వైవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ప్రభుత్వం ద్వారా వారు పొందిన లబ్ధిని తెలుసుకున్నారు.వారి అనుమతితో జగనన్న స్టిక్కర్‌ను ఇంటి ముఖద్వారం పై అతికించారు. అనంతరం ఈ.బోనంగిలో కొలువుదీరిన శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ సత్యవతి, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పరవాడ వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, పార్టీ నేతలు బైలపూడి భగవాన్ జయరామ్, కోటాన రాము, గనిరెడ్డి మహాలక్ష్మినాయుడు, బట్టు సూర్యకుమారి, అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్ములు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, లంకెలపాలెం పీఏసీఎస్ ఛైర్మన్ బురద రాజు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకన్నకు సహస్ర ఘటాభిషేకం



సహస్ర ఘటాభిషేకంలో కలశాలు



పుష్పాలంకరణలో స్వామివారి మూలవిరాట్

నక్కపల్లి : ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తమై కల్కి అవతారంలో వెలసిన మూలవిరాట్ సన్నిధిలో పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారం వేదపండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కొండపై షడ్భుజాలతో ఏకశిలపై కల్కి అవతారంలో అశ్వారూఢుడై వెలసిన స్వామివారి నిజరూపానికి విశేష పుష్పాలంకరణ చేసారు. ధూప దీప నైవేద్యాలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం 108 కలశాలతో అష్టోత్తర ఘటాభిషేకం, విశేష సుగంధ పరిమళ ద్రవ్యాలతో పూజలు జరిపారు. ప్రత్యేక హోమం నిర్వహించారు. కార్యక్రమాల్లో సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, గొట్టుముక్కల వరప్రసాద్, పీసపాటి శేషాచార్యులు, పీతాంబర శ్రీధరాచార్యులు, రామగోపాలాచార్యులు, కృష్ణమాచార్యులు, సుదర్శన స్వామి, గోపాల కృష్ణమాచార్యులు, రాజగోపాల కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా 'రైవాడ' నీటిమట్టం

దేవరాపల్లి: రైవాడ జలాశయం మండు వేసవిలోనూ కనుచూపు మేర నీటి నిల్వలతో నిండుకుండలా కళకళలాడుతోంది. జలాశయం నీటిపై ఆధారపడి రబీ పంటలు సాగు చేసిన ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 109.15 మీటర్లు ఉంది. జలాశయం నుంచి జీవీఎంసీకి 50 క్యూసెక్కుల నీటి సరఫరా యథావిధిగా కొనసాగుతోంది. వెరసి జలాశయంలో రెండు టీఎంసీల మేర నీరు ఉన్నట్లు ఇరిగేషన్ డీఈ జి.సత్యంనాయుడు తెలిపారు. ప్రస్తుత రబీ సీజన్‌తోపాటు ఖరీఫ్ సాగుకు సైతం సాగునీటికి ఎటువంటి ఢోకా ఉండబోదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



నిండుకుండలా రైవాడ జలాశయం

మానవాళి సంతోషమే రంజాన్ సందేశం

- నేడు పండగ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- ముస్తాబైన మసీదులు
- ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్న ముస్లింలు

అనకాపల్లి టౌన్/కశింకోట: జిల్లాలో రంజాన్ పండగ ఘనంగా నిర్వహించేందుకు మసీదులు ముస్తాబయ్యాయి. నెల రోజులుగా కఠోర ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లిం సోదరులకు శుక్రవారం సాయంత్రం నెలవంక దర్శనంతో శనివారం ఈదుల్‌ఫితర్ (రంజాన్) పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ముస్లింలకు ఆరాధ్యమైన దివ్య ఖురాన్ ఈ మాసంలోనే అవతరించడంతో రంజాన్ పండగకు ఇంత ప్రాముఖ్యత ఏర్పడింది. ఈ నెలంతా వారు ఎంతో కఠోర దీక్షతో ఉపవాసాలు (రోజా) ఆచరించడంతో పాటు నెల రోజుల పాటు రాత్రుళ్లు తూచా తప్పకుండా తరావీ నమాజును ఆచరించారు. చివరి పది రోజుల్లో ఐదు రాత్రులు జాగారం ఉండి తమ ఉపవాస దీక్షలను పూర్తిచేశారు. నెలవంక కనబడడంతో శుక్రవారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్‌తో ఉపవాస దీక్షలు, తరావీ నమాజు పూర్తయినట్లు ఇమాం ప్రకటించారు. సమాజంలోని పేదవారు సైతం తమతో పాటు ఆనందంగా పండుగ జరుపుకునేలా ఫిత్రా (గోధుమలు, నగదు) దానం చేశారు. అనకాపల్లిలో జామియా మసీదు, కశింకోటలో నూరీ మసీదు విద్యుత్‌కాంతులతో ధగధగలాడాయి.



కశింకోటలో విద్యుత్ దీపాలంకరణలో నూరీ మసీదు



విద్యుత్‌కాంతుల్లో ధగధగలాడుతున్న అనకాపల్లి జామియా మసీదు

ఈదుల్ ఫితర్ జరుపుతారిలా..

నెలవంక కనబడిన మరుసటి రోజున ముస్లిం సోదరులు ఈదుల్‌ఫితర్ (రంజాన్) పండగను జరుపుకుంటారు. ఉదయమే ఇంటిల్లిపాది స్నానాలు చేసి కొత్త బట్టలు వేసుకుంటారు. పురుషులు సమీపంలోని ఈద్గాలకు లేదా మసీదులకు వెళ్లి రెండు రకాల 'ఈదుల్‌ఫితర్' నమాజు చేస్తామని ముస్లింలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మతగురువులు చెప్పే ఖురాన్ సందేశాలను భక్తితో ఆలకించిన అనంతరం వారంతా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. చివరగా ముస్లిం సోదరులు తమ ఇళ్లలో సేమియా పాయసం స్వీకరించడంతో రంజాన్ పండగ ముగుస్తుంది.

అధిక పరిహారం చెల్లించాలి

- సుజల స్రవంతి భూసేకరణపై గ్రామ సభలో రైతులు
- ప్రభుత్వానికి నివేదిస్తామన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

అనకాపల్లిటౌన్ : బాబూజగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణానికి రైతుల నుంచి భూసేకరణలో భాగంగా తుమ్మపాల గ్రామంలో శుక్రవారం గ్రామసభ జరిగింది. ఈ సభలో పలువురు రైతులు తమ భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, పరిహారంగా అధిక మొత్తం చెల్లించాలని అడిగారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.రమామణి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మంచి ధర వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు ఏమైనా అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా ఇవ్వాలని, రైతులకు క్షేత్రస్థాయిలో తమ సిబ్బంది సహకారమందిస్తారని తెలిపారు. దీనికి రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, రైతు సంఘాల నాయకులు, రైతులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి

విద్య, వైద్యానికి సీఎం జగన్ పెద్దపీట

- జగన్ నాయకత్వంలో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు
- రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ



శిలాఫలకాన్ని ఆవిష్కరించి రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : విద్య, వైద్యరంగాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. జాతీయ రహదారి నుంచి స్థానిక నెహ్రూచౌక్ రహదారి వరకు రూ.కోటీ 40 లక్షలతో నూతనంగా నిర్మించిన రోడ్డును ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని చూసి పెద్ద ఎత్తున పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. 2022 సంవత్సరానికి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, స్వస్థ భారత్(హెల్దీ భారత్) విభాగంలో అనకాపల్లి దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందన్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ఎక్స్‌లెన్సీ అవార్డును జిల్లా కలెక్టర్ అందుకోవడం గర్వంగా ఉందన్నారు. విద్య, వైద్యరంగాల్లో తమ ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ పురస్కారమే నిదర్శనమన్నారు. ఈ అవార్డుకు కారణమైన ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. అనకాపల్లి–అచ్యుతాపురం రహదారిని రూ.230 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. జాతీయ రహదారికి అనుసంధానంగా పలు రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. కొత్తూరు గ్రామంలో ఎర్రచెరువును సుందరీకరించనున్నట్టు వెల్లడించారు. ఎంపీ డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ పట్టణంలో రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయంటూ విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలకు ఈ రహదారి అభివృద్ధే చెంపపెట్టన్నారు. అంతకుముందు దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్మూర్తి, జెడ్పీ పి.వెంకటరమణ, వైఎస్సా ర్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, పట్టణ సచివాలయాల ఇన్‌చార్జి కొణతాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

అప్పన్న చందనోత్సవానికి సర్వం సిద్ధం

- ఆదివారం తెల్లవారుజామున 4 గంటల నుంచి సర్వదర్శనాలు
- సాధారణ భక్తులకు పెద్ద పీట
- రాత్రి 7 గంటలకు సింహగిరిపై ప్రవేశ గేట్లు మూసివేత
- అప్పటి వరకు క్యూల్లో ఉన్నవారందరికీ దర్శనాలు
- ప్రొటోకాల్ వీఐపీలకు ఉదయం రెండు స్లాట్లలో దర్శనాలు
- లక్ష యాభైవేల మంది భక్తులు వస్తారని అంచనా



అప్పన్న నిజరూపం

సింహాచలం : వైశాఖ శుద్ధ తదియను పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని ఏడాదంతా చందనం మణుగుల్లో నిత్యరూపంలో దర్శనమిచ్చే సింహాద్రినాథుడి నిజరూప దర్శనం లభించే సమయం ఆసన్నమవుతోంది. ఏడాదిలో కేవలం ఒక్క రోజులోని కొన్ని గంటలు మాత్రమే లభించే ఈ అరుదైన దర్శనాన్ని చేసుకునేందుకు తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే సాధారణ భక్తులకే పెద్దపీట వేస్తూ వారికి దర్శనాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కలెక్టర్ మల్లికార్జున, సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు సారధ్యంలో అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. 1.50 వేల మంది భక్తులు చందనోత్సవానికి వస్తారని జిల్లా యంత్రాంగం అంచనా వేస్తోంది.

ఒంటిగంట నుంచి వైదిక కార్యక్రమాలు ప్రారంభం

చందనోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తెల్లవారుజామున ఒంటిగంట నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలు ప్రారంభిస్తారు. సుప్రభాతసేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, కలశారాధన చేస్తారు. అనంతరం వెండి బొరుగులతో స్వామిపై ఉన్న చందనాన్ని తీసి నిజరూపభరితుడ్ని చేస్తారు. తెల్లవారుజామున 3.30గంటలకు తొలిదర్శనాన్ని దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజుకు అందిస్తారు. 3.30గంటల నుంచి 4గంటల వరకు రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ వారిచే సంప్రదాయ వస్త్ర సమర్పణ ఉంటుంది. రాత్రి 8.30గంటల నుంచి సహస్రఘటాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 11గంటల నుంచి శీతలోపచారాలు, ఇతర వైదిక కార్యక్రమాలు నిర్వహణ అనంతరం తొలవిడతగా మూడు మణుగుల చందాన్ని స్వామికి సమర్పించి మళ్లీ నిత్యరూపభరితుడ్ని చేస్తారు.

ఏర్పాట్లు ఇలా...

- తెల్లవారుజామున 4 గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభమవుతుంది. రాత్రి 7గంటలలోపు క్యూలైన్లలోకి భక్తులను అనుమతిస్తారు.
- ఉదయం 5గంటల నుంచి 7గంటల వరకు, తిరిగి ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు రెండు స్లాట్లలో ప్రొటోకాల్ వీవీఐపీలకు దర్శనం కల్పిస్తారు.
- సింహగిరిపైకి కేవలం డ్యూటీ పాస్‌లు ఉన్న వాహనాలను, ప్రొటోకాల్ వీఐపీ వెహికల్ పాస్ ఉన్న వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.
- పాత అడవివరం జంక్షన్, గురుకుల పాఠశాల, పాత గోశాల జంక్షన్ వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ప్రతి పార్కింగ్ ప్రదేశంలో చలివేంద్రాలు, లైటింగ్, టెంట్లు, కార్పెట్లు, కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు.



సింహగిరిపై ఏర్పాటు చేసిన దర్శన క్యూలు



సహస్ర ఘటాభిషేకానికి కలశాలు సిద్ధం

- శనివారం సాయంత్రం 6 గంటల నుంచి కొండపైకి ప్రవేటు వాహనాలను అనుమతించరు.
- ఆదివారం ఉదయం 3గంటల నుంచి పాత గోశాల జంక్షన్, పాత అడవివరం జంక్షన్‌ల నుంచి దేవస్థానానికి చెందిన నాలుగు బస్సులతోపాటు, దేవస్థానం అద్దె చెల్లించిన 56 ఆర్టీసీ బస్సుల్లో భక్తులను ఉచితంగా సింహగిరికి చేరుస్తారు. సాయంత్రం 6 గంటలతో బస్సులను నిలిపివేస్తారు. ఖాళీ బస్సులను మాత్రమే కొండపైకి పంపిస్తారు.
- ఈసారి ప్రసాదాల విక్రయాన్ని కొండదిగువకు మార్పు చేశారు. పాత గోశాల జంక్షన్, పాత అడవివరం జంక్షన్ వద్ద ప్రసాదాల విక్రయాలు జరుపుతారు.
- శనివారం సాయంత్రం 4గంటల వరకు మాత్రమే ఆర్టీసీ బస్సుల్లో కొండపైకి భక్తులను అనుమతిస్తారు. ఆ తర్వాత ఖాళీ బస్సులను కొండపైకి పంపించి కొండపై ఉన్న భక్తులను కొండదిగువకు చేరుస్తారు.
- సర్వదర్శనంతో పాటు రూ.300, రూ.1000 టికెట్టుపై వచ్చేభక్తులందరికీ ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద నుంచే లఘు దర్శనాన్ని కల్పిస్తారు. వీరికి కూడా దర్శన సమయాలను సూచిస్తూ స్లాట్లను పెట్టారు.
- చందనోత్సవంనాడు దివ్యాంగులకు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు ప్రత్యేక దర్శన సమయం కేటాయించారు.
- ఉచిత దర్శనం క్యూ, రూ.300 టికెట్టు సింహగిరిపై ఉన్న బస్టాండ్ నుంచి ప్రారంభమవుతాయి. రూ.1000 టికెట్ క్యూ మేఐహెల్ప్ యు కేంద్రం వద్ద నుంచి ప్రారంభమవుతుంది. రూ.1500 క్యూ పాత పీఆర్వో కార్యాలయం నుంచి ప్రారంభమవుతుంది.
- సింహగిరిపైన, కొండదిగువన కలిపి మొత్తం ఆరు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఐదు అంబులెన్స్, 108 వాహనాలను, దేవస్థానానికి చెందిన అంబులెన్స్ అందుబాటులో ఉంచుతున్నారు.
- భక్తులకు అత్యవసర పరిస్థితుల్లో బయటకి తీసుకొచ్చేందుకు ఎమెర్జెన్సీ గేట్లు ఏర్పాటు చేస్తున్నారు.
- సింహాచలంలో ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ ఏర్పాట్లను దృష్టిలో ఉంచుకుని చందనోత్సవానికి నగరం నుంచి సింహాచలం వచ్చే భక్తులు హనుమంతవాక నుంచి అడవివరం జంక్షన్ చేరుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.
- క్యూల్లో మంచినీరు, మజ్జిగ విరివిగా అందించే ఏర్పాటు చేశారు.

సమాచారం కోసం ఫోన్ నంబర్లు

చందనోత్సవం సమాచారం కోసం సింహగిరిపై సమాచారకేంద్రం నంబర్ 0891–2784949, కొండదిగువ సమాచార కేంద్రం 0891–275666లలో సంప్రదించవచ్చు.

బాణసంచా ప్రమాదంలో బాలుడికి గాయాలు



గాయపడిన బాలుడు ప్రవీణ్

కోటవురట్ల: కొడవటిపూడిలో పండగ పూట అపశృతి చోటు చేసుకొని ఓ బా లుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలో మరిడమ్మ తల్లి పండగను పురస్కరించుకుని ఆలయం వద్ద గురువారం బాణసంచా కాల్చారు. పండగ ప్రశాంతంగా ముగిసిందనుకుంటున్న దశలో మిగిలిన బాణసంచా మందును అన్నం ప్రవీణ్ అనే 11 ఏళ్ల బాలుడు సేకరించి మందు అంతా ఒక కాగితంలో వేసి అగ్గిపుల్ల వెలిగించాడు. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి బాలుడి ముఖం, చేతులు కాలిపోయాయి. వెంటనే బాలుడిని తుని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం ప్రాణాపాయం తప్పిందని, చికిత్స పొందుతున్నట్టు బంధువులు తెలిపారు. బాలుడి తల్లిదండ్రులు ఉపాధి కోసం సికింద్రాబాద్‌లోని ఓ ఇటుక బట్టీలో పని చేస్తున్నారు. బాలుడు కొడవటిపూడిలో నాన్నమ్మ చిట్టెమ్మ వద్ద ఉంటున్నాడు.

రాష్ట్రస్థాయి అండర్–17 చదరంగం పోటీలు ప్రారంభం

నర్సీపట్నం: రాష్ట్రస్థాయి అండర్ 17 ఫెడరేటింగ్ చదరంగం పోటీలు నర్సీపట్నంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్న పోటీలకు ముఖ్య అతిథులుగా డీఎస్పీ, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చదరంగం పోటీల్లో రాణించే విద్యార్థులు విద్యలో మరింత చురుగ్గా ఉంటారన్నారు. సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ చదరంగం దిగ్గజం ప్రత్యూష నర్సీపట్నానికి చెందిన క్రీడాకారిణి అన్నారు. ప్రత్యూష వంటి క్రీడాకారులు నర్సీపట్నంలో తయారు కావాలని ఆయన ఆకాంక్షించారు. చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.భీమారావు మాట్లాడుతూ ఒక కేటగిరి టోర్నమెంట్‌ను రేటింగ్ టోర్నమెంట్‌గా నిర్వహించడం చరిత్రాత్మకమన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఈ టోర్నమెంట్ నాలుగు రోజులపాటు జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు మే 1న పంజాబ్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, వుడా వెంకట్రావు, ఏపీ చెస్ అసోసియేషన్ కోశాధికారి జ్యాలాముఖి, టౌన్ ఎస్సై గోవిందరావు, అసోసియేషన్ జిల్లా సెక్రటరీ శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ వుడా రాము, కోశాధికారి భిస్వాస్ పాల్గొన్నారు.



చదరంగం పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

23న శశిలో ఐఐటీ, నీట్‌పై అవగాహన

తగరపువలస (విశాఖ జిల్లా): 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు సంగివలస శశి విద్యాసంస్థల్లో ఈ నెల 23న ఐఐటీ, నీట్‌పై అవగాహన కలిగిస్తున్నట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఐఐటీ జేఈఈ, నీట్ పరీక్షలపై సందేహాలను తీరుస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ తెలిపారు. మరిన్ని వివరాలకు 97059 25599, 97056 35599 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం



సమావేశంలో పాల్గొన్న జేసీ జాహ్నవి, చిక్కాల రామారావు

సాక్షి, అనకాపల్లి: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో భాగంగా చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం పట్ల రైతులకు అవగాహన కలిగించాలన్నారు. రైతులకు యంత్రాలను అద్దెకు ఇచ్చే కేంద్రాలను విరివిగా స్థాపించాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని, పథకాన్ని క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి రైతులకు పాలవెల్లువ ప్రయోజనాలను పాడిరైతులకు వివరించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు యంత్రాలు అద్దెకిచ్చే కేంద్రాలను స్థాపిస్తూ, పీఎం కిసాన్ కేవైసీ ప్రక్రియ పూర్తి చేయడానికి అధికారులతోపాటు సలహా కమిటీ సభ్యులు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఉద్యానవన రైతులకు జీడిపంటలో 70 శాతం మాత్రమే దిగుబడి వస్తుందన్నారు. మామిడిపంటలో కూడా నష్టాలు ఏర్పడుతున్నాయని, ఉద్యాన రైతులకు బీమా వర్తింప చేయాలన్నారు. డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పి.చినతల్లి, సలహా మండలి సభ్యులు ఆర్.గంగునాయుడు, వి.అచ్చంనాయుడు, ఎస్.రమణ, జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు, ఉద్యానవన, మార్కెటింగ్, పశుసంవర్థక, బ్యాంకు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యవసాయ కూలీ మృతి



దొంగబాబు మృతదేహం



గ్రామస్తులతో విద్యుత్, పోలీసు అధికారుల చర్చలు

కోటవురట్ల: విద్యుత్ షాక్ కారణంగా ఓ వ్యవసాయ కూలీ మృతి చెందాడు. కె.వెంకటాపురం గ్రామానికి చెందిన రెడ్డి దొంగబాబు (55) శుక్రవారం ఉదయం పొలంలోకి కూలిపని కోసం వెళుతుండగా తెగిపడి ఉన్న విద్యుత్ తీగెలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ నారాయణరావు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రమేష్ మాట్లాడుతూ విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగానే దొంగబాబు ప్రాణాలు కోల్పోయాడని ఆరోపించారు. ఉదయమే విద్యుత్ తీగెలు తెగిపడడంతో రైతులు స్థానిక సబ్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారని, అయినా వెంటనే విద్యుత్ సరఫరా నిలపకపోవడంతో దొంగబాబు బలయ్యాడన్నారు. గ్రామంలో 35 ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా ఉన్నాయని, తెగిపడిన విద్యుత్ తీగెల కారణంగా గ్రామంలో ఇప్పటి వరకు నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయినట్టు చెప్పారు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ శాఖ డీఈ సురేష్‌బాబు, ఏడీఈ సత్యానందం, ఏఈ చంద్రమౌళి గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. విద్యుత్ శాఖ నుంచి బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం ఇచ్చేందుకు, గ్రామంలో కాలం చెల్లిన విద్యుత్ తీగెలను మార్చేందుకు అంగీకరించినట్టు రమేష్ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

85 కిలోల గంజాయితో నలుగురు అరెస్టు

రెండు వాహనాలు స్వాధీనం



నిందితులు, గంజాయితో ఇన్‌చార్జి సీఐ ఇలియాస్ అహ్మద్

మాడుగుల రూరల్: పాడేరు నుంచి మైదాన ప్రాంతాలకు 85 కిలోల గంజాయి రవాణా చేస్తూ మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నలుగురు వ్యక్తులు శుక్రవారం పట్టుబడ్డారు. స్థానిక అదనపు ఎస్ఐ ఎస్.నాగరాజు కథనం ప్రకారం..పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి షాహిద్‌ఖాన్, లఖన్‌సింగ్, ఆజిమ్‌త్ ఉల్లా, ఆరిపిషాలు కారులో గంజాయి తరలిస్తున్నారు. మరో వాహనం పైలెట్‌గా ముందువెళుతోంది. తాటిపర్తి పోలీసు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. వీరిని పట్టుకున్నారు. 85 కిలోల గంజాయి, రెండు వాహనాలు, 7 సెల్‌ఫోన్లతోపాటు వెయ్యి రూపాయల నగదు స్వాధీనం చేసుకొన్నామని, నిందితులను అరెస్టు చేశామని అదనపు ఎస్ఐ తెలిపారు. ఇన్‌చార్జి సీఐ ఇలియస్ అహ్మద్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధం

- 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు
- విశాఖలో 1,201 మంది, అనకాపల్లిలో 4,259 మంది దరఖాస్తు
- రేపు 11 కేంద్రాల్లో జరుగనున్న పరీక్షలు



విశాఖలోని శ్రీకృష్ణాపురం గురుకులం

విశాఖ విద్య: ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎంట్రన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులకు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఉన్న గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. ఆయా కేంద్రాల్లో 5వ తరగతికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియెట్‌కు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎంట్రన్స్ పరీక్ష జరుగనుంది. ఎండల తీవ్రత దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా గురుకుల ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ రూపవతి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆధార్ కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్ను తప్పనిసరిగా వెంట తీసుకురావాలి. నిర్ణీత సమయానికి ఒక గంట ముందు నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నారు.

అనకాపల్లి జిల్లాలో:

అనకాపల్లి జిల్లాలో దేవరాపల్లి (బాలురు), నక్కపల్లి (బాలికలు), గొలుగొండ (బాలురు), సబ్బవరం (బాలురు), కోనాం (బాలికలు), నర్సీపట్నం (బాలికలు), తాళ్లపాలెం(బాలికలు), కొక్కిరాపల్లి (బాలికలు) పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఐదో తరగతి ప్రవేశాల కోసం 2,742 మంది, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం కోర్సుల్లో ప్రవేశం కోసం 1,517 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

క్లుప్తంగా

మండుతున్న ఎండలు

కశింకోట: కశింకోట ప్రాంతంలో వేసవి ఉష్ణోగ్రతలు కొనసాగుతుండటంతో ప్రజల ఇక్కట్లు తప్పట్లేదు. శుక్రవారం కూడా సూర్య తాపంతో జనాలు విలవిలలాడారు. ప్రధానంగా వృద్ధులు, పిల్లలు ఇళ్లలో ఉన్నా ఇబ్బంది పడ్డారు. అత్యవసర పనులున్నవారు తప్ప, చాలా వరకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. అయితే గురువారంతో పోల్చుకుంటే కాస్త ఉష్ణోగ్రతలు తక్కువగానే నమోదైనట్లు వాతావరణ నిపుణులు చెప్తున్నారు.

నాబార్డ్ ఏజీఎంకు పదవీ విరమణ సత్కారం



శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ ఉద్యోగంలో బదిలీలు సహజమని నాబార్డు విశ్రాంత ఏజీఎం శ్రీనివాసరావు అన్నారు. స్థానిక విజయా రెసిడెన్సీలో జిల్లా స్వచ్ఛంద సంస్థల సమాఖ్య, విశ్వ సమాఖ్య ఆధ్వర్యంలో ఏజీఎం వీడ్కోల సభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ప్రేమాభిమానులు చూపిస్తూ, సంస్థలన్నీ సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాబార్డు నూతన ఏజీఎం సుమంత్‌కుమార్, నెట్‌వర్క్ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కర్రి జోగినాయుడు, జిల్లా స్వచ్ఛంద సంస్థల సమాఖ్య, విశ్వసమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం



సారె ఊరేగింపులో మహిళా భక్తులు

అనకాపల్లిటౌన్: స్థానిక గాంధీనగరం మరిడిమాంబ ఆలయ 7వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగాయి. అమ్మవారి ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి, పూజలు చేశారు. సాయంత్రం భారీగా మహిళా భక్తులు పాల్గొని అమ్మవారి సారె ఊరేగించారు. ఈ ఊరేగింపులో పురవీధుల గుండా సాగింది. అంతకుముందు అమ్మవారికి సారె నివేదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు ఐ.ఆర్.గంగాధర్, అధ్యక్షుడు వేగి రమణ, ఇల్లపు నూకేష్, దొడ్డి చిన్నారావు, కనకల రాము, మహిళా భక్తులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 1,562 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	--	--
మొదటి రకం	3,750	4,120
రెండో రకం	3,400	3,890
మూడో రకం	3,200	3,490

అనకాపల్లి సినిమాలు

రుద్రుడు	రాజా
కలియుగ భగవాన్	సత్యనారాయణ స్క్రీన్-1
ఈవిల్ డెడ్ రైజ్	సత్యనారాయణ స్క్రీన్-2
రావణాసుర	షిర్డీసాయి
విరుపాక్ష	పర్తిసాయి
విడుదల(పార్ట్-1)	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
శాకుంతలం	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 24 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-12 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 426 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 397 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

పచ్చిరొట్ట.. భూసారంలో దిట్ట



అనకాపల్లి సమీపంలో జనుము పంటను పరిశీలిస్తున్న అధికారులు



సీతానగరం వద్ద సాగులో ఉన్న పచ్చిరొట్ట ఎరువుగా వాడే గడ్డి

- రబీ పంటల అనంతరం సాగు చేస్తే మేలు
- పంట దిగుబడులు పెరిగేందుకు ఆస్కారం
- రసాయనాల వినియోగం తగ్గించే మార్గం

అనకాపల్లి రూరల్: రసాయన ఎరువుల వాడకం ప్రతీ ఏటా విపరీతంగా పెరిగిపోతోంది. ఫలితంగా భూసారం క్షీణిస్తోంది. దీని ప్రభావం తరువాత సాగు చేసే పంటలపై పడి దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో పొలంలో సారం పెంచుకోవడానికి రైతులు రబీ పంటల అనంతరం పొలాల్లో పచ్చిరొట్ట పైరును పెంచడం ఎంతో మంచిదని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

గుళికలతో నష్టం

ఖరీఫ్, రబీ పంటల్లో రైతులు గుళికలను అధికంగా వాడడం వల్ల భూమి లోపల సూక్ష్మ జీవులు నశించిపోతున్నట్టు శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. గతంలో ఒక గ్రాము మట్టికి కోట్లాది సూక్ష్మ జీవులుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య లక్షల్లోకి పడిపోయినట్టు పరిశోధనల నివేదికల ఆధారంగా తెలుస్తోంది. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియదున్నడం వల్ల తిరిగి సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉందని వ్యవసాయశాఖాధికారులు రైతులకు సూచిస్తున్నారు.

పోషకాలు అధికం

గతంలో రైతులు భూసారం పెరగడానికి పచ్చిరొట్ట పైరులను రబీ పంటల అనంతరం వేసేవారు. ఇటీవల కాలంలో పచ్చిరొట్ట పైర్ల పెంపకం తగ్గిపోయింది. దీనివల్ల భూసారం తగ్గి, పంటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. తెగుళ్లను అరికట్టడానికి విచ్చలవిడిగా రసాయనాలను పిచికారీ చేసి రైతులు, అనర్థాలను కొని తెచ్చుకుంటున్నారు. రబీకి, ఖరీఫ్‌కు మధ్యలో పచ్చిరొట్ట పెంపుతో భూసారం బాగా పెరుగుతుంది. జనుము, జీలుగు, పిల్లి పెసర, ఉలవ తదితర రకాలను రబీ, ఖరీఫ్ సీజన్ల మధ్య సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకూ పెంచి ఖరీఫ్ పంట వేసేముందు భూమిలో కలియ దున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు అధికంగా వుంటాయి. నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం, భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 శాతం నుంచి 2 శాతం వరకూ వుంటాయి. స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా ఈ పైర్ల వల్ల భూమిలో చేరతాయి.

చౌడు భూముల్లో జీలుగు మేలు

సహజంగా చౌడుబారిన భూముల్లో రేగడి మట్టి వేసే కంటే జీలుగు వేస్తే భూమి సారం పెరిగి తర్వాతి పంట సాగుకు అనుకూలంగా మారుతుంది. జీలుగు పంట కూడా నాటిన 30 రోజుల్లోనే ఏపుగా చేతికొస్తుంది. దీన్ని భూమిలో కలియదున్నితే చాలు. అనకాపల్లి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో కశింకోట, మునగపాక, అనకాపల్లి, సబ్బవరం, పరవాడ మండలాల్లో ప్రస్తుతం రబీ పంటల సాగు చివరి దశకు వచ్చింది. రబీ కోతలు ప్రారంభమైనందున వాటి అనంతరం భూమిలో పచ్చిరొట్ట విత్తనాలు జల్లేందుకు ఇదే సరైన అదనుగా అధికారులు పేర్కొంటున్నారు.

పచ్చిరొట్టతో భూసార సంరక్షణ



రైతులు రబీ, ఖరీఫ్ సీజన్ల మధ్య వ్యవసాయ క్షేత్రాల్లో పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసుకోవాలి. దీని వల్ల భూసారం పెరిగి పంటల అధిక దిగుబడులకు అవకాశం ఏర్పడుతుంది. పంట కోసిన వెంటనే భూమిలో పదును ఉన్నప్పుడే ఇటువంటి విత్తనాలు చల్లుకోవాలి. పచ్చి రొట్ట విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి.

– పీయూటీపీ రంగాచారి, వ్యవసాయాధికారి, అనకాపల్లి

ఏపీజీవీబీ సేవలపై అవగాహన



బుర్రకథ ద్వారా ఖాతాదారులకు అవగాహన

అనకాపల్లి రూరల్: మండలంలోని మామిడిపాలెంలో ఏపీ గ్రామీణ వికాస బ్యాంక్ సేవలపై ఖాతాదారులకు బుర్రకథ రూపంలో అవగాహన కల్పించారు. గ్రామీణ ఖాతాదారుల్లో చైతన్యం కలిగించేందుకు ఇటువంటి ప్రచారం సాగిస్తున్నామని బ్యాంక్ మేనేజర్ కుప్పిలి వెంకట శ్రీనివాసరావు చెప్పారు. డిపాజిట్లపై ఇతర జాతీయ బ్యాంకుల కంటే తమ బ్యాంక్ అధిక వడ్డీ ఇస్తోందన్నారు. మహిళలు, వ్యవసాయ, గృహ, వాహన, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి రుణాలు, బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ. 4,100 చొప్పున రుణ సదుపాయం అందిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన జీవనజ్యోతి, జీవన సురక్ష బీమా పథకంలో ఖతాదారులు చేరాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి మాలోతు సురేష్, ఫీల్డ్ ఆఫీసర్ మోటమర్రి శ్రీనివాసరావు, వెలుగు కో ఆర్డినేటర్ కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



బోర్ల మరమ్మతుల ఆటోను ప్రారంభిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి రూరల్: మండలంలో మంచినీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ గొర్లి సూరిబాబు చెప్పారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్‌డీఈపీ బోర్ల మరమ్మతులు, నిర్వహణ కోసం క్రాస్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు బోర్ల మరమ్మతుల కోసం ఏర్పాటు చేసిన ఆటోను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ధర్మారావు, తహసీల్దార్ గంగాధరరావు, జేఈ శ్రీనివాసరావు, ఆర్‌ఐ రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఒమ్మి మధుబాబు, మజ్జి వెంకటఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా!

భూదేవి చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలింపు



మట్టి తవ్వకాలతో గుంతలమయంగా మారిన అయ్యన్నపాలెం భూదేవి చెరువు

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో మట్టిమాఫియా రెచ్చిపోతుంది. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులు.. మెట్ట ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి వేళ తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఇష్టానుసారంగా తవ్వకాలు చేయడంతో చెరువులు, మెట్ట ప్రాంతాలు ప్రమాదకరంగా మారుతున్నాయి.

తాజాగా అయ్యన్నపాలెం భూదేవి చెరవులో..

ఇప్పటికే మండలంలోని పలు ప్రాంతాల్లో రెచ్చిపోయిన మట్టిమాఫియా తాజాగా అయ్యన్నపాలెం భూదేవి చెరువుపై పడింది. గురువారం రాత్రి కొంత మంది పొక్లెయిన్ సాయంతో ట్రాక్టర్లతో తెల్లవార్లు మట్టి అక్రమంగా తరలించుకు పోయారు. విషయం తెలుసుకున్న అయ్యన్నపాలెం గ్రామ ఉప సర్పంచ్ బుదిరెడ్ల కనకరాజు చెరువు వద్దకు వెళ్లగా అప్పటికే వారంతా పరారయ్యారు. సబ్బవరం మండలానికి ఆనుకుని ఉన్న కోటపాడు మండలంలోని సూదివలస, పాతవలస తదితర గ్రామాలకు మట్టి కొంతమంది గుట్టు చప్పుడు కాకుండా తరలించుకుపోతున్నారని కనకరాజు చెబుతున్నారు. రెండు మండలాల సరిహద్దులో భూదేవి చెరువు ఉండడంతో అక్రమార్కులకు బాగా కలిసివస్తుందని ఉప సర్పంచ్ తెలిపారు. రాత్రి వేళ పోలీస్‌లు, ఇరిగేషన్, మైనింగ్, విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టాలని ఆయన కోరారు.

డిగ్రీకళాశాల అధ్యాపకుడికి ఏయూ డాక్టరేట్



వీసీ ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరిస్తున్న అధ్యాపకుడు ఇంద్రసేన

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ బోధిస్తున్న పి. ఇంద్రసేనకు ఆంధ్రా విశ్వవిద్యాలయం డాక్టరేట్ వరించింది.రాజనీతి.ప్రభుత్వ పాలనా శాస్త్రం విభాగ విశ్రాంత ఆచార్యులు ఈఏ నారాయణ, డాక్టర్ పి.ప్రేమానందం సంయుక్త పర్యవేక్షణలో రోల్ ఆఫ్ ఎన్‌జీవో ఇన్ డిజాస్టర్ మేనేజ్మెంట్ ఇన్ నార్త్ కోస్టల్ డిస్ట్రిక్ట్స్ –ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై ఇంద్రసేన జరిపిన పరిశోధనకు గానూ డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు ఇంద్రసేనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి తదితరులు అభినందించారు.

క్రీడాకారులకు అభినందన

అనకాపల్లిటౌన్: ఆంధ్రా యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 22, 23 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్, మాస్టర్ మెన్ ఉమెన్ పవర్‌లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ కార్యదర్శి బద్రీనాథ్ శుక్రవారం అభినందించారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో జెర్సీని ఆవిష్కరించారు.

ప్రతి కుటుంబానికీ సొంతిల్లు



కైలాసపట్నం జగనన్న కాలనీలో పర్యటిస్తున్న జెడ్పీటీసీ ఉమాదేవి, అధికారులు

కోటవురట్ల: రాష్ట్రంలోని ప్రతి నిరుపేదకూ సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో వైఎస్సార్ జగనన్న కాలనీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి అన్నారు. కైలాసపట్నంలో శుక్రవారం హౌసింగ్ డే నిర్వహించారు. ప్రత్యేకాధికారి ఉదయశ్రీతో పాటు జెడ్పీటీసీ ఉమాదేవి లేఅవుట్‌లో పర్యటించి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకున్నారు. సీఎం జగన్ ప్రతి కుటుంబానికీ సొంతిల్లు, పిల్లలకు బంగారు భవిష్యత్‌ను ఇచ్చేలా విద్య, మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా సంక్షేమ పథకాలను అందిస్తూ ఆసరాగా నిలుస్తున్నారని కొనియాడారు. ఇళ్లు కట్టుకునేందుకు స్థలాన్ని ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తున్నారని తెలిపారు. నిధులు సకాలంలో జమకావడంతో పాటు మెటీరియల్ కూడా అందుబాటులో ఉందని, ప్రతి ఒక్కరూ త్వరిత గతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, పీఆర్ జేఈ వర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరుణ, ఈవోపీఆర్డీ ప్రేమ్‌సాగర్, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో మహిళల ఆరోగ్యం

మునగపాక: మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని గణపర్తి సర్పంచ్ చదరం నాయుడు సూచించారు. మండలంలోని గణపర్తిలో శుక్రవారం విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ మహిళలు సంపూర్ణ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ట్రస్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ సాయి చరణ్ పోషకాహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థుల ఆట పాటలు, మాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్, పీఎంసీ చైర్మన్ శరగడం చిన్న, ఏఎన్ఎం సంతోషి, అంగన్‌వాడీ టీచర్లు గంగాభవాని, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వామపక్ష నేతల ప్రచార భేరీ



ప్రచార భేరీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని అచ్యుతాపురం, మోసయ్యపేట ప్రాంతాల్లో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచార భేరీ నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు ఆర్.రాము, కర్రి అప్పారావులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతోందని విమర్శించారు. కార్పొరేట్లకు రద్దు చేసిన రుణాలను వసూలు చేయాలని డిమాండ్ చేశారు.

నువ్వుల సాగుపై రైతులకు అవగాహన



అందలాపల్లిలో నువ్వు పంట క్షేత్ర సందర్శనలో బీసీటీ కేవీకే శాస్త్రవేత్తలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం, అందలాపల్లిలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం నమూనా ప్రదర్శనలో భాగంగా నువ్వుల పంటను శుక్రవారం పరిశీలించారు. బీసీటీ కేవీకే ద్వారా సరఫరా చేసిన వైఎల్ఎం-66 నువ్వుల రకం పంట సాగు తీరుని అధ్యయనం చేశారు. నువ్వులలో సమగ్ర పంటల యాజమాన్యంపై బీసీటీ శాస్త్రవేత్త శ్రీనివాసరావు రైతులకు వివరించారు. ఏవో శంకర్‌గోవింద, మహిళా అభ్యుదయ రైతులు కొణతాల రామ సత్యవతి, బుద్ద కృష్ణారావు, బీసీటీ సామాజిక కార్యకర్త పీఏ నాయుడు, రైతులు బి.దేవి, ఎస్.పరశురాం తదితరులు పాల్గొన్నారు.

69 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి రూరల్: మండలంలోని సీతానగరంలో 69 మంది లబ్ధిదారులకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ ఎంపీపీ గొర్లి సూరిబాబు శుక్రవారం పట్టాలు పంపిణీ చేశారు. తగరంపూడి లేఅవుట్‌లో ఈ స్థలాలను కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పేదవాడికి సొంతిల్లు ఉండాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంతో మంది నిరుపేదలకు సొంతింటి కల సాకారమైందన్నారు. ఇంటి స్థలంతో పాటు గృహనిర్మాణానికి ఆర్థిక సాయం కూడా ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ధర్మారావు, సర్పంచ్‌లు యాదగిరి అప్పారావు, రాపేటి నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఆనందరాము, ఎంపీటీసీ రాపేటి వెంకటేష్, జంపన శివాజీ వర్మ, పాలమరెడ్డి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ హెడ్ క్వార్టర్‌ను సందర్శించిన ఎస్పీ



డాగ్ స్క్వాడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మురళీ కృష్ణ



డీఎస్పీతో కలసి కార్యాలయంలోకి వెళ్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అరిలోవ(విశాఖ తూర్పు): అనకాపల్లి జిల్లా కొత్త ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కె.వి.మురళీకృష్ణ మొదటిసారిగా విశాలాక్షినగర్‌లో ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ హెడ్ క్వార్టర్‌ను శుక్రవారం సందర్శించారు. ఇక్కడి డీఎస్పీ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయనకు ఏఆర్ పోలీసులు కవాతు నిర్వహించి, ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హెడ్‌క్వార్టర్స్‌లో సిబ్బంది సంఖ్య, వారి పని తీరు, సౌకర్యాలు, సమస్యలు, భవనాల పరిస్థితి, ఆయుధాగారం, డాగ్ స్క్వాడ్, షాపింగ్ కాంప్లెక్స్, పోలీస్ కల్యాణ మండపం తదితర వాటి గురించి డీఎస్పీని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతా క్రమ శిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. విధులలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఇన్‌స్పెక్టర్లు ఆర్‌వీవీఎస్ఎస్ చంద్రశేఖర్, బి.రామకృష్ణారావు, ఎం.సతీష్, కె.వెంకటరావు పాల్గొన్నారు.

సెయింట్ జాన్స్ స్కూల్లో రంజాన్ వేడుకలు



కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్లో ముస్లిం వేషధారణలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

కశింకోట: స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో శుక్రవారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ముస్లిం వేషధారణలో నృత్యాలు, నాటికలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబుల్ కుమార్ మాట్లాడుతూ చిన్న తనం నుంచే అన్ని మతాలను గౌరవించడం అలవర్చుకోవాలని విద్యార్థులను సూచించారు. అన్ని వర్గాలను ఒక చోట చేర్చి ఉన్నత విలువలు నేర్పించడం ఒక్క పాఠశాలతోనే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కరస్పాండెంట్ బత్తుల అనూరాధ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా 'జగనన్నే మా భవిష్యత్తు'



మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం 1వ వార్డులో ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై రూపొందించిన కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను గృహ యజమానుల అనుమతితో వారిళ్లకు అతికించారు. బ్యాడ్జీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు లగిశెట్టి గణేష్, నారాయణరావు పాల్గొన్నారు.

రంజాన్ వేడుకలకు సన్నద్ధం



కశింకోటలో రంజాన్ దీక్ష విరమించి ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం కుటుంబాలు



రంజాన్ మాస దీక్షల అనంతరం మసీదు ముందు స్థానిక ముస్లిం యువకులు

కశింకోట: మండలంలోని ముస్లింలు శనివారం రంజాన్ పండగ నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. స్థానిక జామియా, నూరి మసీదులు, నరసింగబిల్లిలోని మసీదుల్లో నెల రోజులపాటు నిష్టగా నిర్వహించిన రంజాన్ దీక్షలు శుక్రవారం ముగిశాయి. ఈ నేపథ్యంలో ఉత్సాహంగా రంజాన్ పండగకు ముస్లింలు సన్నద్ధమయ్యారు. కశింకోటలోని నూకాంబిక అమ్మవారి ఆలయం సమీపంలో ఉన్న ఈద్-ఘాహ్ వద్ద శనివారం ఉదయం 8.30 గంటలకు ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు నూరి మసీదు కమిటీ ప్రతినిధి ఐ.ఎం.షరీఫ్ తెలిపారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



జగనన్న కాలనీలో డీఎల్‌డీవో మంజులవాణి

మునగపాక: జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని డీఎల్‌డీవో మంజులవాణి సూచించారు. శుక్రవారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని గంటవానిపాలెం జగనన్న కాలనీని ఆమె సందర్శించారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హులైన ప్రతీ నిరుపేదకు ఇళ్ల పట్టాతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమయ్యే ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తోందన్నారు. కాలనీలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు అరిగా శ్రీను, కోన అప్పలరాజు, ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రమణ పాల్గొన్నారు.